క్లుప్తంగా

శాకంబరిగా పార్వతీదేవి



బిక్కవోలు: గ్రామంలోని గోలింగేశ్వరస్వామి ఆలయం వద్ద కొలువైన పార్వతీదేవి అమ్మవారు సోమవారం శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు అమ్మవారిని కూరగాయలతో అలంకరించారు.

మహిళలకు సారె పంపిణీ



మహిళలకు పంపిణీ చేస్తున్న సత్తెమ్మ తల్లి సారె

బిక్కవోలు: గ్రామంలోని జవ్వలదొడ్డిలో కొలువైన సత్తెమ్మ తల్లికి భక్తులు ఆదివారం 558 కిలోల సారె సమర్పించారు. సోమవారం ఆలయ కమిటీ, యూత్ సభ్యుల ఆధ్వర్యంలో సారెను స్థానిక మహిళలు ఇంటింటికీ వెళ్లి ప్రసాదంగా అందించారు. పసుపు, కుంకుమ, గాజులు, స్వీట్లు, అరటిపండ్లు, చలివిడి అందించారు.

ఆలయ భూమి కౌలుకు వేలం

పెదపూడి: దోమాడలో వేణుగోపాలస్వామి ఆలయ భూమికి సంబంధించిన కౌలు వేలం పాట సోమవారం పూర్తయిందని ఆలయ ఈఓ వద్దాది సత్యనారాయణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ, ఆలయానికి సంబంధించి 18.03 ఎకరాల సాగు భూమి ఉందన్నారు. ఈ భూమికి వేలం పాట నిర్వహించగా, ఈ ఏడాది రూ.3.5 లక్షలకు ఓ రైతు దక్కించుకున్నాడు. గతేడాది జూన్ 11న ఈ భూమికి కౌలు వేలం పాట నిర్వహించగా, అప్పుడు రూ.2.6 లక్షలకు అదే గ్రామానికి చెందిన రైతు సొంతం చేసుకున్నారు. అప్పుడు తక్కువ సొమ్ముకు పాట వెళ్లడంతో రద్దు చేసి, మళ్లీ వేలం పాట నిర్వహించారు. ఈసారి వేలంపాట ఎక్కువకు వెళ్లగా, ఏడాదికి రూ.90 వేల ఆదాయం పెరిగిందని ఈఓ తెలిపారు.

నేటి నుంచి కేంద్ర బృందం పర్యటన

బిక్కవోలు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యకలాపాలను పరిశీలించేందుకు కేంద్ర బృందం మండలంలో మూడు రోజులు పర్యటిస్తుందని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, మంగళవారం బిక్కవోలులో, బుధవారం రంగాపురంలో, 17న ఆరికరేవుల గ్రామంలోని పర్యటిస్తారని చెప్పారు. ఈ పర్యటనలో వివిధ కేంద్ర కార్యక్రమాలపై విచారణ చేస్తారన్నారు. మండలంలోని అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలన్నారు.

హెల్మెట్ ధారణపై అవగాహన



వాహనదారుడికి హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న సీఐ

అనపర్తి: మోటార్ సైకిళ్లపై వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ విల్ వీకే సుమంత్ అన్నారు. స్థానిక మెయిన్ రోడ్‌లోని బీపీఎల్ పెట్రోలు బంకు వద్ద సోమవారం హెల్మెట్ ధారణ వల్ల ప్రయోజనాలను వాహనదారులకు వివరించారు. వాహనాలకు సంబంధించిన డాక్యుమెంట్లు కూడా వెంట ఉండేలా చూసుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాన్ని నడిపితే జరిగే ప్రమాదాలు, నిబంధనల ప్రకారం తీసుకునే చర్యలను సీఐ వివరించారు. ఎస్సై ఎల్.శ్రీనునాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల వాడకాన్ని తగ్గించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

బిక్కవోలు: విద్యార్థులు సెల్‌ఫోన్ల వాడకాన్ని తగ్గించాలని ఎస్సై రవిచంద్రకుమార్ అన్నారు. మండలంలోని పందలపాకలో పడాల పెద్దపుల్లారెడ్డి ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం నైతిక విలువలపై ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో జరుగుతున్న చెడు ప్రభావాలు, వాటిని అధిగమించి ఏ విధంగా ముందుకు వెళ్లాలనే దానిపై సూచనలు చేశారు. డ్రగ్స్, సిగరెట్లు, మద్యం, జూదం వంటి కార్యకలాపాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా పాఠశాలల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెచ్ఎం శ్రీనివాసరెడ్డి, ఎస్ఎంసీ అధ్యక్షులు కోణాల సత్తిరాజు పాల్గొన్నారు.

సాగుపై నకిలీ నీడ



రంగంపేటలో ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఏఓ శ్రీనివాసరావు (ఫైల్)



పెదపూడి మండలం చింతపల్లిలో వరి నాట్లు వేస్తున్న కూలీలు

- ఎరువులు, పురుగు మందుల కొనుగోలులో రైతులు జాగ్రత్త
- అన్నదాతలకు పూర్తి అవగాహన అవసరం
- రసీదు తప్పనిసరి అంటున్న వ్యవసాయాధికారులు

రంగంపేట: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ తరుణంలో పొలాలకు ఎరువులు అధికంగా వినియోగిస్తారు. దీంతో మార్కెట్లలోకి నకిలీ ఎరువులు, పురుగు మందులు పెద్దఎత్తున వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు రైతులను హెచ్చరిస్తున్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో ఎరువులు కొనుగోలు చేసే విషయంలో ఒకటికి రెండుసార్లు జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచిస్తున్నారు. అధికారుల సూచనల మేరకు ఎరువులు, పురుగు మందులు తీసుకోవాలని, లేదంటే నిలువునా మోసపోయే అవకాశం ఉందంటున్నారు.

అనపర్తి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఖరీఫ్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. అనపర్తి మండలంలో 12 వేల ఎకరాలు, పెదపూడి మండలంలో 18,500, బిక్కవోలు మండలంలో 13 వేలు, రంగంపేట మండలంలో 11 వేల ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో దాదాపు 65 శాతం నారుమడులు తయారయ్యాయి. బోర్లు, ఇంజిన్ల వద్ద నారుమడులు వేసిన పొలాల వద్ద నాట్లు వేస్తున్నారు. మిగిలిన చోట్ల నారుమడుల తయారీలో రైతులు బిజీగా ఉన్నారు. సుమారు పది శాతం మేర వరినాట్లు వేసినట్లు అంచనా.

దళారుల వద్ద వద్దు

నిషేధిత పురుగు మందులు కొనుగోలు చేస్తే రైతులు నష్టపోతారని వ్యవసాయాధికారులు, విజిలెన్స్ అధికారులు సూచిస్తున్నారు. పంట దిగుబడి అధికంగా వస్తుందని ఎరువుల వ్యాపారులు నమ్మించి, అనుమతి లేని వివిధ కంపెనీల కల్తీ ఎరువులు, పురుగు మందులు రైతులకు అంటగట్టే అవకాశం ఉందంటున్నారు. అలాగే అనుమతి లేని దుకాణాలు, దళారుల వద్ద కొనుగోలు చేయరాదంటున్నారు. తక్కువ ధరకే మందులు విక్రయిస్తారని, వాటిని కొనుగోలు చేస్తే పంట దిగుబడి తగ్గడంతో పాటు, భూసారం దెబ్బతింటోందన్నారు. మందుల లేబుళ్లను మొదట పరిశీలించి, అవి కంపెనీ ఎరువులా లేక స్థానికంగా తయారు చేసి విక్రయిస్తున్నారా అన్న విషయాలను రైతులు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన తర్వాత తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని అధికారులు చెబుతున్నారు.

నకిలీవి విక్రయిస్తే లైసెన్సులు రద్దు



ఎరువుల దుకాణాల్లో నకిలీ ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తున్నట్లు మా పరిశీలనలో గుర్తిస్తే దుకాణాల లైసెన్సులను రద్దు చేస్తాం. మందులు కొనుగోలు చేసిన రైతులకు డీలర్, దుకాణ యజమాని సంతకాలతో కూడిన బిల్లులను అందజేయాలి. క్రిమి సంహారక మందులు కొనుగోలు చేసే సమయంలో డబ్బాపై ఉన్న వివరాలను పూర్తిగా పరిశీలించాలి. లేదా తెలిసిన వారికి చూపించి అది ఏ కంపెనీదో నిర్ధారించిన తర్వాతే కొనుగోలు చేయాలి. డబ్బాపై చూపించిన వివరాల ప్రకారమే మందు పిచికారీ చేయాలి. లేదంటే పంటలు దెబ్బతినే అవకాశం ఉంది.

– కె.శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి, రంగంపేట మండలం

ఫిర్యాదు చేయవచ్చు

దుకాణాలు లైసెన్స్ లేకుండా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేయాలి. మందుల లాట్ నంబర్‌ను బట్టి తయారు చేసిన తేదీని గుర్తించి, ఏ కంపెనీ, ఏ రకం వంటి విషయాలను చూడాలి. దుకాణ యజమాని, డీలర్‌తో సంతకాలతో కూడిన బిల్లులను తప్పక తీసుకోవాలి. ముఖ్యంగా విత్తనాలకు సంబంధించి సంచులపై సీలు తొలగించినట్లు గుర్తిస్తే, వాటిని కొనుగోలు చేయరాదు. సత్వరం రైతులు అధికారులకు ఫిర్యాదు చేయాలి. అధికారుల పరిశీలనలో అది వాస్తవమని తేలితే సంబంధిత డీలర్‌పై కేసు నమోదు చేసి, రైతులకు న్యాయం జరగడానికి అవకాశం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పెదపూడి: వాతావరణ పరిస్థితుల దృష్ట్యా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీఓ మన్యం శ్రీనివాస్ చౌదరి అన్నారు. పెదపూడి, దోమాడ, పెద్దాడ గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. రక్షిత తాగు నీటి పథకాల వద్ద పారిశుధ్య పనులు చేయించారు. క్లోరినేషన్ ఎలా చేస్తున్నారో అధికారులు, సిబ్బందిని ఆరా తీశారు. గ్రామాల్లో కార్మికులు చేస్తున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎండలు పెరగడం, వర్షాలు కురవడం వంటి వాతావరణ మార్పులతో ప్రజలకు అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో వైద్యారోగ్య, పంచాయతీ రాజ్ శాఖల సిబ్బంది సంయుక్తంగా గ్రామాల్లో పర్యటించి, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలన్నారు. గ్రామాల్లో చెత్తకుప్పలు లేకుండా చర్యలు తీసుకుని, బ్లీచింగ్ చల్లించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్న వారిపై ఉన్నతాధికారుల ఆదేశాలతో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు జి.ఉషారాణి, అనంత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పెదపూడిలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న శ్రీనివాస్ చౌదరి

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

సీతానగరం: మండలంలోని పలు గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ రాజమండ్రి రూరల్ ఏఈ జేపీబీ నటరాజన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పురుషోత్తపట్నం సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ పరిధిలో చెట్ల తొలగింపు కారణంగా బుధవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాను నిలిపివేస్తామన్నారు. వంగలపూడి, సింగవరం, చీపురుపల్లి, అచ్చయ్యపాలెం, పెదకొండేపూడి, పురుషోత్తపట్నం, రామచంద్రపురం, చినకొండేపూడి పరిధిలోని గ్రామాల్లో వ్యవసాయ బోర్లకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు.

నేడు జి.యర్రంపాలెం పరిధిలో..

రాజానగరం: మండలంలోని జి.యర్రంపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ అగ్రికల్చర్ ఫీడర్‌పై వార్షిక మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నందున మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారని ఏపీఈపీడీసీఎల్ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నటరాజన్ తెలిపారు. ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. అలాగే కానవరం సబ్‌స్టేషన్ పరిధిలో ఇండస్ట్రియల్ ఫీడర్‌పై మరమ్మతుల కోసం జి.యర్రంపాలెంలోని వ్యవసాయ సర్వీసులకు, రాధేయపాలెంలో గృహావసరాలకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

ఓహెచ్ఆర్‌ల నిర్వహణ గాలికి..



బిక్కవోలులో నాచు పట్టి ఉన్న వాటర్ ట్యాంకు



ఖాళీగా దర్శనమిస్తున్న నిర్వహణ బోర్డు

బిక్కవోలు: తాగునీటి ట్యాంకుల(ఓహెచ్ఆర్) నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. మండల కేంద్రమైన బిక్కవోలు గ్రామం.. అందునా తహసీల్దార్ కార్యాలయం చెంతనే ఉన్న పంచాయతీ నిర్వహణలోని తాగునీటి ట్యాంకు నిర్వహణ లోపభూయిష్టంగా ఉంది. ట్యాంకు నాచు పట్టి ఉండగా, పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. కనీసం ట్యాంకు నిర్వహణ బోర్డుపై క్లీనింగ్ తేదీని కానీ, తదుపరి శుభ్రపర్చాల్సిన తేదీ కానీ లేవు. ట్యాంకు నిర్వహణ ఎలా ఉందో దీనినిబట్టే అవగతమవుతోంది. ఈ ట్యాంకు పరిధిలో సుమారు 1,200 కుళాయిలు ఉన్నాయంటున్నారు. ఇప్పటికైనా అధికారులు వాటర్ ట్యాంకుల పరిశుభ్రతపై దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అనుమతి లేని విక్రయాలపై చర్యలు తీసుకోవాలి

బిక్కవోలు: మండలంలో అనుమతి లేకుండా జరుగుతున్న పెట్రోలు, డీజిల్ విక్రయాలపై చర్యలు తీసుకోవాలని పలువురు బంకు యాజమానులు తహసీల్దార్ బీఎస్‌వీవీ కృష్ణకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం వారు తహసీల్దార్ కార్యాలయంలో ఆయనకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బంకుల యాజమానులు మాట్లాడుతూ, మండలంలో అనుమతి లేకుండా ప్రెటోలు, డీజిల్ అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. సరైన పత్రాలు లేకుండా ఆయిల్‌ను తరలిస్తున్న మినీ ట్యాంకర్‌ను ఐదు రోజుల క్రితం ప్రెటోలు బంకు వారు పట్టుకుని అప్పగిస్తే, అధికారులు వదిలివేశారని ఆరోపించారు. ఇటువంటి చర్యల వల్ల బంకులకు భారీ నష్టాలు వస్తున్నాయని తెలిపారు. ఈ ఘటనలో ఎంఎస్‌వో వ్యవహారం అనుమానాస్పదంగా ఉందని చెప్పారు. విజిలెన్స్ అధికారులు దీనిపై విచారణ జరిపి, న్యాయం జరిగేలా చూడాలని కోరారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న బంకు యాజమానులు

గ్రీవెన్స్‌లో రెండు అర్జీలు

సీతానగరం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు రెండు అర్జీలను అందుకున్నారు. స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి నాలుగు బొమ్మల సెంటర్ వరకు ఆక్రమణల వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని, ఆక్రమణలు తొలగించాలని ఫిర్యాదు అందింది. ఆర్టీసీ బస్‌స్టేషన్ వద్ద కుమ్మరి గొయ్యి ఆక్రమణలకు గురవుతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. రఘుదేవపురం వైపు డ్రైన్ ఏర్పాటు చేయకపోతే శెట్టిబలిజపేట ముంపులోకి వెళ్లుతుందని కె.సత్యనారాయణ అర్జీని అందించారు. ఇంటి స్థలం విషయంలో బంధువులు తనపై దాడి చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ చినకొండేపూడికి చెందిన పి.చిన్నమారియ్య ఫిర్యాదు అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ కేవీఎస్ఎస్ మూర్తి, ఏఓ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పాతుకుపోతే ఎట్లా..!

- రోడ్లపైనే లోడింగ్, అన్ లోడింగ్
- వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- ప్రయాణికుల అవస్థలూ బేఖాతరు
- నర్సరీల వద్ద నెలకొన్న తీవ్ర సమస్య



రోడ్డుపై నిలిపి వాహనంలో మొక్కల లోడింగ్

కడియం: సుదూర ప్రాంతాల్లోను ప్రసిద్ధి చెందిన నర్సరీలు కడియం మండలంతో పాటు, చుట్టు పక్కల ఏడెనిమిది మండలాలకు ఎంతో కీలకం. ఆయా మండలాల్లోని ప్రజలకు ఉపాధి అవకాశాలను విస్తృతంగా కల్పిస్తున్నాయనడంలో సందేహం లేదు. ఏటా సీజన్‌లో రోడ్లపైనే భారీ వాహనాలను నిలిపి ఉంచి మొక్కలను లోడింగ్ చేస్తుండడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జాతీయ రహదారి మొదలు చిన్నపాటి ట్రంక్ రోడ్ల వరకు ఇదే పరిస్థితి ఉండడంతో.. మండలంలో ఏ రోడ్డుకు వెళ్లినా ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. వాహనాల రద్దీ కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తడం సర్వసాధారణం. ఉద్దేశపూర్వకంగా రోడ్డుపైనే వాహనాన్ని నిలిపి మొక్కలు లోడింగ్ అయ్యేంత వరకు ఉంచడంతో ఆ మార్గంలో ప్రయాణిస్తున్న వాహనాలు ట్రాఫిక్ దిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి.

ఎగుమతుల సీజన్

ప్రస్తుతం మొక్కల ఎగుమతుల సీజన్ కావడంతో నిత్యం 200 నుంచి 300 వివిధ రకాల వాహనాల్లో మొక్కల లోడింగ్ జరుగుతుంది. మొక్కల ఎగుమతులు, దిగుమతులకు అనుగుణంగా తమ నర్సరీల్లో పార్కింగ్ సదుపాయం అతి తక్కువ నర్సరీల్లో మాత్రమే ఉంది. ప్రధాన రోడ్లను ఆనుకుని ఉన్న నర్సరీల్లో అత్యధిక శాతం మొక్కల ఎగుమతులు, దిగుమతులు రోడ్డుపైనే వాహనాన్ని ఉంచి జరుగుతున్నాయని ప్రజలు చెబుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదాలు

వాహనాలను రోడ్డుపైనే పెట్టి మొక్కలు ఎగుమతి, దిగుమతి చేయడంతో పాటు, నర్సరీల్లో వినియోగించే మట్టి గుట్టలను సైతం రోడ్డును ఆనుకుని వేయడం వల్ల గతంలో మండలంలోని పలుచోట్ల ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. వాహనదారులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలూ ఉన్నాయి. ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు పోలీసు, రెవెన్యూ యంత్రాంగంతో పాటు, నర్సరీ సంఘం కూడా రైతులను చైతన్యపరిచి, రోడ్లపై ప్రయాణించే వారికి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసేందుకు ప్రయత్నించింది. ఈ ప్రయత్నం మధ్యలోనే విడిచిపెట్టేయడంతో ఇప్పుడు ఎప్పటిలాగే రోడ్ల వెంబడి వాహనాల పార్కింగ్ కొనసాగుతోంది.



హైవే వెంబడి నిలిపి ఉంచిన వాహనాలు



కడియపులంక వద్ద వాహనాల రద్దీ కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులు

ట్రాఫిక్‌కు ఆటంకం

ముఖ్యంగా భారీ వృక్షాలను లారీల్లోకి ఎక్కించేందుకు క్రేన్లను సైతం వినియోగిస్తుంటారు. ఒక్కో మొక్కను నర్సరీ నుంచి బయటకు తెచ్చి, లారీలోకి ఎక్కించేందుకు అరగంటకు పైగా సమయం పడుతుంది. లారీతో పాటు, క్రేన్‌ను కూడా రోడ్డుపైనే ఉంచి ఈ ప్రక్రియను కొనసాగిస్తున్నారు. అప్పటి వరకు ఈ రోడ్డుపై ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. ముఖ్యంగా దుళ్ల–మడికి రోడ్డు, కడియం–దుళ్ల రోడ్డు, కడియం–బుర్రిలంక రోడ్లలో నిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఈ రోడ్లలో మొక్కలను లోడింగ్ చేసేందుకు రోడ్డుపైనే లారీలను ఉంచి క్రేన్ల సాయంతో మొక్కలను ఎగుమతి చేస్తున్నారు. ఆ సమయంలో రోడ్డుపై ప్రయాణించే అన్ని వాహనాలు నిలిచిపోతున్నాయి.

లారీల పార్కింగ్

జాతీయ రహదారిపై కడియపులంక వద్ద లారీ సప్లై కార్యాలయాల వద్ద కూడా ఉదయం, సాయంత్రం వేళల్లో వందలాది లారీలను పార్కింగ్ చేస్తున్నారు. ఈ ప్రదేశంలో నిత్యం ప్రమాదాలు జరుగుతూ ఉంటాయి. అయినప్పటికీ వాహనాలను నిర్లక్ష్యంగా పార్కింగ్ చేస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొక్కలను ఎగుమతి, దిగుమతి చేసుకునేందుకు రోడ్లపై వాహనాలను నిలిపి ఉంచకుండా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా సింగిల్ రోడ్లలో తగిన పార్కింగ్ స్థలాన్ని నర్సరీల వద్ద ఏర్పాటు చేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డుపైనే పెడుతున్నారు

సీజన్‌లో మొక్కల ఎగుమతులు, దిగుమతులు సాధారణం. అందుకు వచ్చే వాహనాలను ప్రధాన రోడ్డుపైనే పెడుతున్నారు. దీంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతోంది. కనీసం ట్రాఫిక్‌ను క్లియర్ చేసే ప్రయత్నం కూడా చేయడం లేదు. దీంతో వీరవరం నుంచి కడియం వరకు రావడానికి ముప్పావు గంటకు పైగా సమయం పట్టింది.

– వీరబాబు, ప్రయాణికుడు

సర్వీస్ రోడ్డు అత్యవసరం

కడియపులంక వద్ద ఉదయం, సాయంత్రం వేళల్లో హైవే పక్కనే పెద్ద సంఖ్యలో లారీలు పార్కింగ్ చేస్తున్నారు. వీటి కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇక్కడ సర్వీస్ రోడ్డు ప్రతిపాదనగానే మిగిలిపోయింది. కనీసం సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలు తగ్గుతాయి.

– మణికంఠ, ప్రయాణికులు

పులగుర్త హైస్కూల్‌లో గరిమెళ్ల జయంతి



గరిమెళ్లకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది

అనపర్తి: ప్రముఖ గేయ రచయిత, జాతీయ కవి గరిమెళ్ల సత్యనారాయణ జయంతి వేడుకను పులగుర్త ఆర్‌వీపీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు కె.సీతామహాలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణ మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో గరిమెళ్ల తన గేయాలతో ప్రజలను ఉత్తేజపరిచి బ్రిటిష్ వారి గుండెల్లో రైళ్లు పరుగెత్తించారన్నారు. మాకొద్దు తెల్ల దొరతనం అనే గేయాన్ని పాడి వినిపించారు. ఇటీవల జాతీయ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలు కుసుమ, పావని, రూపకు రూ.1,500 నగదు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది కె.జయశ్రీ, వెంకటేశ్వరరావు, రత్నకుమార్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి గౌరీదేవి ఎంపిక



గౌరీదేవిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కోరుకొండ: ట్రిపుల్ ఐటీకి కోరుకొండకు చెందిన విద్యార్థిని ముల్లంగి గౌరీదేవి ఎంపికైంది. కోరుకొండలోని ఓ ప్రైవేట్ విద్యాసంస్థలో చదువుతోంది. ఈ సందర్భంగా విద్యాసంస్థ నిర్వాహకులు సోమవారం ఆమెను సత్కరించారు. కష్టపడి చదివితే ఎంతటి లక్ష్యాన్నైనా సులువుగా అందుకోవచ్చని వక్తలు అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సివిల్ ఇంజినీరింగ్‌కు మంచి భవిష్యత్తు



వర్క్‌షాప్‌లో ప్రసంగిస్తున్న సంతోష్‌రెడ్డి

రాజానగరం: సివిల్ ఇంజినీరింగ్ చేసిన గ్రాడ్యుయేట్లకు వివిధ రంగాల్లో విస్తృత శ్రేణిలో కెరీర్ డెవలప్‌మెంట్‌కి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని స్కైస్ ఎండీ బద్ధం సంతోష్‌రెడ్డి అన్నారు. స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో కెరీర్ అవకాశాలు అనే అంశంపై హెచ్ఓడీ డాక్టర్ పీవీ కోటేశ్వరరావు అధ్యక్షతన సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేట్ కంపెనీల్లో లభిస్తున్న అనేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై వివరించారు. వాటిని అందిపుచ్చుకునేందుకు అవసరమైన నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు కృషి చేయాలన్నారు. జీజీయూ వీసీ డాక్టర్ కేవీబీ రాజు, డీన్ డాక్టర్ బి.ప్రభాకరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులకు శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న సుభాషిణి

రాజానగరం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు, అభ్యసన సామర్థ్యాలు, సమర్థవంతంగా నిర్వర్తించేలా ప్రధానోపాధ్యాయులకు స్కూల్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నారు. ప్రధానోపాధ్యాయులకు అవగాహన కలిగించడమే ఈ శిక్షణ ముఖ్యోద్దేశమని సమగ్ర శిక్షా అడిషనల్ కో–ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి అన్నారు. స్కూల్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులకు ఇచ్చే శిక్షణా తరగతులు మండలంలోని మల్లంపూడి, సాయిమాధవి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణకు ఉమ్మడి జిల్లా నుంచి 176 మంది ప్రధానోపాధ్యాయులు హాజరు కాగా, తొమ్మిది మంది డీఆర్పీలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ అధికారి గౌరీశంకర్రావు, అనపర్తి ఎంఈఓ సత్తిరెడ్డి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఏఐ ఆధారిత కోర్సులతో అవకాశాలు

రాజమహేంద్రవరం సిటీ: కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా ఎంబీఏ కాలేజీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కోర్సులు ప్రారంభించినట్లు నిర్వాహకులు, లెక్చరర్లు కె.ఝాన్సీ, ఎం.విశాలాక్షి సోమవారం తెలిపారు. ప్రొఫెషనల్ మేనేజ్‌మెంట్ విద్యతో పాటు, టెక్నాలజీ రంగంలో మహిళలు ప్రగతి సాధించేందుకు గాను ఎంబీఏ చదువుతున్న విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ప్రారంభించామన్నారు. ప్రస్తుత రోజుల్లో ఏ రంగంలోనైనా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిజ్ఞానం చాలా అవసరమన్నారు. ఈ కోర్సుల ద్వారా విద్యార్థులకు అనేక అవకాశాలు లభిస్తాయన్నారు. ఏఐ శిక్షణ ద్వారా మేనేజ్‌మెంట్ విద్యార్థినులు బిజినెస్ కంటెంట్ క్రియేషన్, డిజిటల్ మార్కెటింగ్, బిజినెస్ ఆటోమేషన్, టాలీ, అకౌంటింగ్ వంటి రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చన్నారు.